జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 16-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 165 పేజీలు: 8 వెల : రూ.7

*** రోజురోజుకూ పెరుగుతున్న ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలు**
*** దాడులు, అత్యాచారయత్నానికి దిగుతున్న వ్యాపారుల అనుచరులు**
*** కేసు పెట్టాలంటే రాజీ చేసుకోవాలంటున్న కొందరు పోలీసు అధికారులు**
*** కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసుల విఫలం**
*** కొందరు పోలీసుల తీరుపై యువ ఐపీఎస్ అధికారి సీరియస్**



# చీటింగ్

**జిల్లాలో రోజురోజుకూ ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలు అధికమవుతున్నాయి. సామాన్య ప్రజల అవసరాలను అదునుగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు, చిట్టీలు ఇస్తూ తిరిగి దాడులు, అత్యాచార యత్నాలకు పాల్పడుతున్న వైనం ఇటీవల జిల్లాలో వెలుగుచూస్తోంది. ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలను అడ్డుకోవాల్సిన పోలీసులు రాజీయత్నానికి పాల్పడుతున్నారు. సిబ్బంది సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని, అదే సమయంలో ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని యువ ఐపీఎస్ అధికారి, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి హెచ్చరికలు చేస్తుండడమే గాకుండా, పలువురిపై కొరడా కూడా విదిలిస్తున్నా కొందరు పోలీసులు మాత్రం తమ తీరును మార్చుకోవడం లేదు. ఇటీవల శ్రీకాకుళం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో నివాసముంటున్న ఓ కుటుంబం స్థానికంగా ఉన్న చిట్స్ సంస్థ మేనేజర్ వద్ద నుంచి కొంత నగదు అప్పు తీసుకుంది. వడ్డీ కట్టడంలో ఆలస్యం కావడంతో సంస్థ మేనేజర్ ఏకంగా వారి ఇంటికి వెళ్లి పెట్రోల్ పోసి దాడికి యత్నించిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసుల వద్దకు ఆ బాధిత కుటుంబం వెళ్లడం, పోలీసులు రాజీయత్నానికి ప్రయత్నించినట్టు బాధితులు వాపోయారు. చివరకు ఆ మేనేజర్‌పై పలు సెక్షన్ల కింద కేసు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. అలాగే రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే మరో ఘటన చోటుచేసుకుంది. ఫైనాన్స్ సంస్థకు చెందిన ఓ వ్యక్తి ఏకంగా అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఎస్పీ ఆదేశాలకే ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.**

## వివాహితపై అత్యాచారయత్నం..

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 15(వార్త):** తనపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని.. కేసు పెట్టాలని ఓ వివాహిత పోలీసులను కోరగా.. రాజీయత్నానికి




అయితే

ప్రయత్నించిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని గొల్లవీధికి చెందిన ఓ వివాహిత ఈ ఏడాది ఉగాదికి ఓ ఫైనాన్స్ కంపెనీలో నెలవారీ వాయిదాల రూపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని తీసుకుంది. ప్రతినెలా వాయిదాలను సక్రమంగా చెల్లిస్తోంది.

గతనెల అప్పులభారంతో భర్త ఇంటి నుంచి పరారయ్యాడు. ఏం చేయాలో తెలియక మూడేళ్ల చిన్నారితో కలిసి ఆమె కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో గత నెల వాయిదా సొమ్ము ఆ వివాహిత చెల్లించలేకపోయింది. ఫైనాన్స్ సంస్థ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి డబ్బులు అడిగారు. ఈనెల 9న ఆమె బంగారం చైన్‌ను బ్యాంకులో తాకట్టు పెట్టి వాయిదా చెల్లిస్తానని, దీనికోసమే శ్రీకాకుళం వెళుతున్నానని చెప్పింది. ఆమె కుమార్తెతో కలిసి రాత్రి ఏడు గంటల సమయంలో ఆటోలో శ్రీకాకుళంలో తన ఇంటికి బయలుదేరింది. చింతాడ జంక్షన్‌లో దిగి శ్రీకాకుళం వెళ్లే బస్సు కోసం వేచిచూస్తోంది. అయితే ఫైనాన్స్ సంస్థకు చెందిన వ్యక్తి ఆమెను నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొత్తరోడ్డు దగ్గర గెడ్డ వైపు ఆమెను తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. దీంతో ఆమె తప్పించుకుని రోడ్డువైపు పరుగుపెట్టింది. ఆమె శ్రీకాకుళం రూరల్ పోలీసులకు పదో తేదీన ఫిర్యాదు చేసింది. అయితే అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తి ఫైనాన్స్ సంస్థకు చెందిన వ్యక్తిగా ఆమె పోలీసులకు సమాచారం అందించింది. వంజంగి గ్రామానికి చెందిన తాండ్ర విద్యాసాగర్ పేరిట ఆ ఫోన్ నంబరు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. విద్యాసాగర్ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. మంగళవారం గ్రామపెద్దలతో కలిసి విద్యాసాగర్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు విచారణ చేపట్టారు. ఆ సమయంలో విద్యాసాగర్‌ను చూడగానే ఆమె గుర్తించి పోలీసులకు తెలిపింది. అయితే పోలీసులు ఆ కేసును రాజీయత్నానికి యత్నించడంతో ఆమె ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



## పలువురు ఎస్ఐలకు బదిలీ

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 15 (వార్త):** జిల్లాలోని ఏడుగురు ఎస్ఐలకు శుక్రవారం బదిలీ అయింది. ఈసారి కూడా పలువురు ఎస్ఐలకు పోలీస్‌స్టేషన్లకు కాకుండా వీఆర్‌కే ఆ శాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. సోంపేట ఎస్ఐ బి.హైమావతిని శ్రీకాకుళం వీఆర్‌కు, శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న గేదెల వాసుదేవరావును విజయనగరం వీఆర్‌కు, కంచిలి ఎస్ఐ జి.రాజేష్‌కు శ్రీకాకుళం వీఆర్‌కు, బారువ ఎస్ఐ ఎల్.చంద్రశేఖర్‌కు విజయనగరం వీఆర్‌కు బదిలీ అయింది. కవిటి ఎస్ఐ టెక్కలి-1 ఎస్ఐగా, శ్రీకాకుళం వీఆర్ ఉన్న చామంతుల రామారావును డీపీటీసీ శ్రీకాకుళంకు, డీపీటీసీలో ఉన్న టి.రాజేష్‌కు కాశీబుగ్గ-1 ఎస్ఐగా , విజయనగరం జిల్లా ట్రాఫిక్ ఎస్ఐ వాసంశెట్టి లోవరాజును సోంపేట, విజయనగరం ఎస్ఐ శ్రీరామ్ హరిబాబుకు బారువ బదిలీ చేశారు.

## ప్రజా ఫిర్యాదులు స్వీకరణకు
# తొమ్మిది వినతులు

**కాశీబుగ్గ, నవంబర్ 15(వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్య క్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన (మీకోసం) ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి 9 వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జాతీయ కబడ్డీ జట్టుకు లోహరిబంద విద్యార్థి మను ఎంపిక



**మందస, నవంబర్ 15(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లోహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అందాల మను జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. లోహరిబంద పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన మను ఎంపిక కావడంపై స్థానికులు అభినందనలు తెలిపారు. జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైనలోహరిబంద పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ, గొల్లలపాలెం ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న విద్యార్థి మను తల్లిదండ్రులు అందాల చంద్రశేఖర్, రజనికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు అభినందనలు తెలియజేశారు.

# యువతకు స్ఫూర్తి బిర్సాముండా

**జలుమూరు, నవంబర్ 15(వార్త):** ఎస్టీ మాకివలస గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి జలుమూరు తహసీల్దార్ జన్ని రామారావు, వాబ యోగి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరానికి, నేటి ఆదివాసీ ఉద్యమానికి స్ఫూర్తి శిఖరం బిర్సా ముండా అన్నారు. బ్రిటిష్ పాలకులు స్థానిక భూస్వాములు గిరిజనులు భూములక్రమించి అనేక దురాగతాలకు పాల్పడుతున్న రోజుల్లో బిర్సా ముండా నాటి సామాజిక, ఆర్థిక అన్యాయాన్ని ఎదిరించి, ప్రజల హక్కుల కోసం పోరాడారన్నారు. ముండా జయంతి వేడుకలు ఇక్కడ జరగడం, ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఆయన చిత్రపటం పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని యువతని కోరారు. కార్యక్రమంలో పాపారావు, సూరపు నాయుడు, హరీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



**మందస:** జనజాతీయ గౌరవ దివాస్‌లో భాగంగా బిర్సాముండా జయంతి మందస మండలంలో గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీ బొందికారి, కిల్లోయి కాలనీలో మండల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణ మాట్లాడుతూ బిర్షాముండా సేవలను వివరించి, కొనియాడారు. ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్ మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సవర కాంచన, చిరంజీవి సర్పంచ్, మాజీ ఎంపీపీ సవర కామేష్, దన్ను, చైతన్య, అర్జున, కోదండరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.




# భూ రీ సర్వేలో లోపాలు సరిచేస్తాం





**వంగర, నవంబర్15(వార్త):** వంగర మండలంలోని దేవకివాడ గ్రామంలో భూ సమస్యలపై రీ సర్వే గ్రామ సభను రీసర్వే డీటీ రెడ్డి గంగాభవాని, సర్వేయర్ నాగేశ్వరరావు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలి ప్రతినిధి కరణం సుదర్శన్ రావు సమక్షంలో గ్రామంలోని రైతులు తమ భూములు తప్పొప్పులపై అర్జీలు పెట్టుకున్నారు. వీటిని సరి చేయడానికే ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**నరసన్నపేట:**గత ప్రభుత్వ హయాంలో మంజూరుచేసిన భూహక్కు పత్రాల సవరణ చేపట్టేందుకు రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. నరసన్నపేట మండలం దసుమంతపురంలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 223 మంది రైతులు ఉన్నారని తెలిపారు. 30మంది రైతులు తమ అర్జీలను అందజేశారన్నారు.

**జలుమూరు:** గతంలో నిర్వహించిన సమగ్ర భూసర్వేలో జరిగిన పలు లోపాలను సరిదిద్దేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. జలుమూరు మండలం ఎస్టీ మాకివలస రెవెన్యూ పంచాయతీలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సర్వేలో ఉన్న కొద్దిపాటి లోపాలను సరిదిద్దుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఉద్దాన పంటలపై అసెంబ్లీలో చర్చ హర్షణీయం



మందస, నవంబరు 15(వార్త): ఉద్దాన పంటలైన జీడి, మామిడి, కొబ్బరి పంటలపై అసెంబ్లీలో చర్చకు తీసుకురావడం మంచి పరిణామమని పలాస నియోజకవర్గ రైతాంగ సమ స్యల సాధన కమిటీ నాయకులు మామిడి మాధవరావు, బెస్త కామేశ్వర రావు, ముడిమంచి ముకుందరావు, గొర్లె చలపతిరావు, తామాడ త్రిలోచన, దాసరి శ్రీరాములు, కొర్ల హేమారావు చౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవా రం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో రైతుల పక్షాన మాట్లాడిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమదా లవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు, మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్లలో వంశధార కాలువ నీరు పలాస ఉద్దానం మీదుగా ఇచ్ఛాపురం వరకు వచ్చేలా కృషి చేయాలని కోరారు. తిత్లీ తుఫానులో సర్వం కోల్పోయి, ఒక్క పైసా కూడా అందని సుమారు 7వేల మంది రైతులకు నష్ట పరిహారం కూడా త్వరలో అందుకోగల మని ఆశిస్తున్నామన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



## ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

**మందస, నవంబర్ 15(వార్త):** మందసలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, చిన్నారులకు నీతి పుస్తకాల బోధన నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సూర్యోదయ స్కూల్ పీఈటీ ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వారోత్సవాలను విజయవంతంచేయాలని ఆమె కోరారు.

## తహసీల్దార్ కార్యాలయానికి ల్యాప్‌టాప్ వితరణ



సారవకోట, నవంబర్ 15(వార్త): సారవకోట మండల తహసీల్దార్ కార్యాలయానికి టీడీపీ బీసీ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ ల్యాప్‌టాప్‌ను వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్దార్ విజయలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోన వెంకటేష్, నక్క గోపి, టీడీపీ నాయకులు దువ్వారి జయరాం, రావాడ సురేష్, కొర్ను హేమంత్, సూరపు రమేష్, వీఆర్‌వో బాలకృష్ణ పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



**నరసన్నపేట, నవంబర్ 15(వార్త):** నిరుపేద లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేశామని ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయన నరసన్నపేట మండలం రావాడపేటలోని ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గతంలో మంజూరుచేసిన గృహ లబ్ధిదారులు ఇంకా నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం తరఫున సహాయ, సహకారాలు అందిస్తామన్నారు.

## యువత సద్వినియోగం చేసుకోవాలి

**సారవకోట, నవంబర్ 15(వార్త):** గ్రంథాలయాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ జి.అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన సారవకోటలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచడం ఆనందదాయకమన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి సాయమ్మ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తకాల ప్రదర్శన

**జలుమూరు, నవంబర్ 15(వార్త):** నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టామని ప్రిన్సిపాల్ డాక్టర్ లత తెలిపారు. శుక్రవారం స్థానిక లైబ్రరీ వద్ద వివిధ పుస్తకాలు ప్రదర్శనకు ఉంచామన్నారు. విద్యార్థులకు కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఇక్కడ ఏర్పాటు చేశామని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలన్నారు.





## ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈవో

**జలుమూరు, నవంబర్ 15(వార్త):** నరసన్నపేట పరిధిలోని నారాయణ ప్రైవేట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంఈవో పి.దాలినాయుడు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పలు జూనియర్ కళాశాలల విద్యార్థుల ఆధార్ సవరణలు, అపార్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సురేష్, సీఆర్ఎంటీ గిరిధర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తూ.. బావిలో పడి వ్యక్తి మృతి

**కాశీబుగ్గ, నవంబర్ 15 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పరిధిలో నిరూపయోగంగా ఉన్న బావిలో ప్రమాదవశాత్తూ.. కాలు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇచ్ఛాపురం పట్టణం నీలకంఠేశ్వర స్వామి వీధికి చెందిన దున్న వీరాస్వామి కాశీబుగ్గలోని బేకరీలో పనిచేస్తున్నారు. ఈయన బావిలో ప్రమాదవశాత్తూ.. కాలు జారిపడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఒకరి అరెస్టు

**ఇచ్ఛాపురం, నవంబర్ 15(వార్త):** ఇచ్ఛాపురం ప్రొహిబిషన్అండ్ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14 మద్యం బాటిళ్లు తరలిస్తున్న శివంగి మాధవరావును అరెస్టు చేసనట్లు సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయనపై పాత కేసులు ఉండడంతో కవిటి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవం నమోదు చేశామన్నారు.

## 17న శ్రీముఖలింగంలో బాలియాత్ర దీపోత్సవం



**జలుమూరు, నవంబర్ 15(వార్త):** శ్రీముఖలింగంలో ఈనెల 17న బాలియాత్ర దీపోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర కాళింగ సామాజిక వేదిక గౌరవ అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు తెలిపారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. ప్రాచీన కళింగ సీమ సంప్రదాయమైన బాలియాత్రను కార్తీక పౌర్ణమి తదుపరి ఆదివారం నిర్వహిస్తామన్నారు. శ్రీముఖలింగేశ్వరుని దర్శనం అనంతరం వంశధార నదీ తీరాన ఈ దీపోత్సవం ఏర్పాటు చేశామన్నారు.

# సంగాంకు పోటెత్తిన భక్తులు





**వంగర, నవంబర్ 15(వార్త):** సంగాం శివాలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో నిండుగా కనిపించింది. భక్తులు తొలుత సువర్ణముఖి, వేగావతి నాగావళి కలిసే త్రివేణి సంగమంలో స్నానపానాదులు చేపట్టారు. ఆలయ అర్చకులు సిద్ధాంతం గణపతి రావు, సిద్ధాంతం శంకరరావు తదితరులు సమక్షంలో పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అంతా శివ నామస్మరణతో మారుమ్రోగింది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలతో పాటు, ఒడిశా ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు చేపట్టారు. భక్తులతో పాటు అయ్యప్ప, శివ స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు చైర్మన్ బోను ఆనందరావు, ఆలయ ఈవో శ్యామలరావు, అర్చకులు అన్ని ఏర్పాట్లు గావించారు.

**వాసునాయుడు పూజలు**

రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒక్కటైన పవిత్ర పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ లీడర్, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొత్స వాసునాయుడు శివునికి పూజలు నిర్వహించారు. ముందుగా త్రివేణి సంగమంలో స్నానం చేసి, అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట సంగాం మాజీ సర్పంచ్ బొడ్రోతు అప్పలనాయుడు, చైర్మన్ బోను ఆనందరావు, అర్చకుడు రమేష్,అర్చకులు తదితరులు ఉన్నారు.



## కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ దుర్యోధనకు ఘన సన్మానం



**మందస, నవంబర్ 15(వార్త):** కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన భావన దుర్యోధనను ఆ గ్రామస్తులందరూ శుక్రవారం పౌర సన్మానం చేశారు. ఈసందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి చేరుకున్నారు. దీనికి సహకరించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి శివాజీ, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, వార్డు నెంబర్లు, గ్రామస్తులు బొంగి వెంకయ్య, వల్లభ హరి కృష్ణ, గున్న నారాయణ, భావన సాంబమూర్తి, మార్పు లోకనాథం, రఘుపతి, జోగారావు, గ్రామంలోని ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, సొసైటీ కార్యాలయ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరంగా పలాస-కాశీబుగ్గ

**కాశీబుగ్గ, నవంబర్ 15 (వార్త):** పలాస-కాశీబుగ్గ పట్టణాన్ని రహదారులు, మౌలిక వసతులు, విద్యుత్ అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఐటీఐ సమీపంలో రహదారి నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు పాలకులు, అధికారులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులకు అభివృద్ధిలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీటీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, కొవ్వూరు సురేష్, వల్లభ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బెల్లుపడలో టీడీపీ సభ్యత్వాల నమోదు

**ఇచ్ఛాపురం, నవంబర్ 15(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వాలు చేపట్టినట్లు రాష్ట్ర బీసీ రెడ్డక సాధికారిక కమిటీ చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి తెలిపారు. 12వ వార్డు పరిధిలో సభ్యత్వాలు నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కొండ సూర్య నారాయణరెడ్డి, లోపింటి తారకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సువర్ణాపురంలో ఎలుగుబంట్లు హల్‌చల్

**మందస, నవంబర్ 15(వార్త):** ఉద్దానంలో ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. ఎలుగుబంట్ల సంచారంతో ఉద్దాన ప్రజలు హడలెత్తుతున్నారు. గతంలో ప్రాణాపాయపరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. ఈ తరుణంలో సువర్ణాపురంలో ఒకేసారి మూడు ఎలుగుబండ్లు ప్రజలను భయాందోళనకు గురి చేశాయి. వీధుల్లో ఎలుగులు తిరగడంతో ప్రజలు తలుపులు వేసుకుని, ఇంటిలోనే ఉండిపోయారు. కొంతమంది తలుపు సందుల్లో నుంచి ఎలుగులను సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. కాగా, కొందరు ధైర్యం చేసి, కర్రలతో తరమడంతో మెల్ల మెల్లగా గ్రామం నుంచి వెళ్లిపోయాయి. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



# భక్తి..శ్రద్ధలతో కేదారేశ్వరుని పూజలు



**మందస, నవంబర్ 15(వార్త):** కార్తీక మాసంలో భక్తులు పూజలు కొనసాగుతున్నాయి. పౌర్ణమి సందర్భంగా కేదారీశ్వరుని వ్రతాలు భక్తులు భక్తి, శ్రద్ధలతో ఆచరించారు. సంప్రదాయం గా వస్తున్న కార్తీక వ్రతాన్ని భక్తులు ఉప వాసంతో జరుపుకొన్నారు.

ఆనవాయి తీగా గ్రామాల్లో బూరెల ప్రసాదాన్ని ఇతరులకు పంచిపెట్టారు. పూజలు అనంతరం శివాలయాలకు వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నబరంపురం గ్రామంలో భక్తులు భజన బృందంగా ఏర్పడి, ఆలయాలకు వెళ్లి, అక్కడ ప్రార్థ నలు జరిపారు. మేళ,తాళాలతో ఆయా ఆలయాల్లో హరే రామ..హరే కృష్ణలతో సంకీర్తలను ఆలపించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

# శ్రీముఖలింగేశ్వరుని ఆలయ శిఖరంపై జ్వాలా తోరణం



**జలుమూరు, నవంబర్ 15(వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలిం గంలో కొలువైన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ శిఖరంపై జ్వాలా తోర ణం వెలిగించారు. కార్తీక పౌర్ణమి కావ డంతో శుక్రవారం ఆలయ అర్చకులు కమిటీ సభ్యుల సహకారంతో ఆలయ శిఖరంపై జ్యోతిని వెలిగించి పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి రోజున ఆలయ శిఖరం పై చీకట్లను తొలగించే జ్యోతిని వెలిగించ డం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జ్వాలా దీపానికి పూజలు నిర్వహించారు.





## జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా

**మందస, నవంబర్ 15(వార్త):** మందస మండలంలోని బిన్నళమదనాపురం గ్రామం సమీపంలో ఓ వ్యాన్ బోల్తా పడింది. సోంపేట నుంచి పలాస వైపు వెళున్న ఐషర్ వ్యాన్ రహదారికి అడ్డంగా పడింది. వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించడంతో..ట్రాఫిక్ జాం సమస్య తొలగింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**వంగర, నవంబర్ 15(వార్త):** మండలంలోని అన్ని గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో వై.దుర్గారావు కోరారు. వంగరలోని కార్యాలయంలో ఉల్లాస్‌పై జరిగిన శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని మండల మహిళా స్వయం శక్తి సంఘాలు వీవోఏలు, సంఘాల్లో ఎంపిక కాబడిన అభ్యసన వలంటీర్లు పాల్గొన్నారు.

## నిఘా నీడలో వనవిష్ణుపురం



**పోలాకి, నవంబర్ 15(వార్త):** అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా నీడలో వనవిష్ణుపురం ఉంది. ఈ గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపరిచేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. గతంలో ఇదే గ్రామంలో రాజకీయ కక్షలు కారణంగా వివాదాలు చెలరేగాయి. దీంతో ప్రజల కదలికలపై గ్రామంలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ శాఖ వారి సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం నరసన్నపేట సీఐ జె.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ నిఘా కెమెరాలను ఎప్పటికప్పుడు పోలాకి ఎస్ఐ, జిల్లా ఎస్పీ కార్యాలయం పర్యవేక్షించనున్నారు.

## ప్రజా చైతన్యం కోసమే సంకల్పం

**పోలాకి, నవంబర్ 15(వార్త):** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజా చైతన్యం కోసమే సంకల్పం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుల్లవానిపేట గ్రామంలో సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో యువతరం క్రమశిక్షణగా మెలగాలని చెప్పారు. గాడి తప్పుతున్న యువతరం భవిష్యత్ గురించి మాట్లాడారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పోలాకి స్టేషన్ అధికారి రంజిత్ కుమార్ సైబర్ నేరాల జరిగే విధానం ప్రజలకు తెలిపి, ఎలా తప్పించుకోవాలో వివరించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 18న మినీ జాబ్ మేళా

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 15 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువత కోసం ఈనెల 18న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. గుజరాతీపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మినీ జాబ్‌మేళా ఉంటుందన్నారు. వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి వారి విద్యార్హత పత్రాలు నకలు, ఆధార్ కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9550967353 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skilluniverse.apssdc.in వెబ్ సైట్ ను సందర్శించి రిజిస్టర్ కావాలన్నారు.

# గిరిజనులను ఆదుకుంటాం

*** వారి అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం * ప్రత్యేక స్టాల్స్‌లో గిరిజన ఉత్పత్తులు * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * మెళియాపుట్టిలో జనజాతీయ గౌరవ్ దివస్ * ఆకట్టుకున్న గిరిజనుల నృత్య ప్రదర్శన**

**మెళియాపుట్టి, నవంబర్ 15 (వార్త):** గిరిజనులను అన్ని రకాలుగా ఆదుకుంటామని, వారి అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ అధ్యక్షతన బిర్సా ముండా 150వ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని మెళియాపుట్టి మండల కేంద్రంలో శుక్రవారం 'జనజాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గిరిజనుల జీవితాలను



మెరుగుపరచడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే 'ధర్తి ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' లక్ష్యమన్నారు. పీఎం జన్ మాన్ కింద 11 అంశాలను గిరిజనుల్లోకి తీసుకెళుతున్నామని, అన్ని గిరిజన పాఠశాలల్లో ప్రత్యేకంగా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. గిరిజన కోపరేటివ్ సొసైటీ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున గిరాకీ కల్పించేలా చర్యలు చేపడుతున్నామని, సేంద్రియ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందని తెలియజేస్తూనే అన్ని ప్రముఖ బ్రాండ్ల దుకాణాలలో డీసీసీ ఉత్పత్తులు లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిసిసి ఉత్పత్తులకు ప్రత్యేక స్టాల్స్, మేళాలు ఏర్పాటు చేస్తామని అలాగే ఈ కామర్స్ వెబ్సైట్లో ఈ ఉత్పత్తులన్నీ లభించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రాసెసింగ్, బ్రాండింగ్, లేబులింగ్ తదితర విషయాలపై గిరిజనులు పూర్తి అవగాహన పెంచుకున్నప్పుడే ఆర్థికాభివృద్ధిని సాధించగలరని కలెక్టర్ తెలియజేశారు. ఐటీడీఏ పీవో యశ్వంత్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, సికిల్ సెల్ ఎనీమియా బాధితులను ఐటీడీఏలో గుర్తిస్తున్నామని, వారికి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ల్ ఏర్పాటు చేశామని, కోటి 30 లక్షల రూపాయలతో ఏకలవ్య పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం త్వరలో పూర్తి చేయనున్నామని, ఐటీడీఏకు రెండు ప్రత్యేక అంబులెన్స్ ఉన్నాయని, త్వరలోనే మరో మూడు అంబులెన్సు కొత్తవి కొనుగోలు చేస్తామన్నారు. 28 కోట్లతో గిరిజన గ్రామాల్లో రోడ్లను వేస్తున్నట్లు తెలియజేస్తూనే జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా 135 మందికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, సికిల్ సెల్ ఎనీమియా కార్డులు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు, భూసార పరీక్షల ఫలితాల పత్రాలు అందజేశామని



చెప్పారు. అల్లూరి, బిర్స ముండా తదితర స్వాతంత్రోద్యమ నాయకుల వేషధారణ ఆకట్టుకున్నాయి. సభా ప్రాంగణంలో వివిధ రకాలైన స్టాల్స్ అలరించాయి. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఐటిడిఎ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి, డిఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, గృహనిర్మాణ శాఖ పీడీ నగేష్, పీహెచ్ వో గణేష్, గిరిజన సంక్షేమ శాఖ డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్, డిప్యూటీ డీఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు, ఎంపిడివో, తహసీల్దార్, వెలుగు ఏపీడి సన్యాసిరావు, గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



# టీడీపీ సభ్యత్వ నమోదులో..
# ఇచ్ఛాపురం 174వ స్థానం

*** నియోజకవర్గంలో మందకొడిగా సాగడం పట్ల ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం * అసెంబ్లీ సమావేశాలకు వెళ్లేముందు కేడర్‌తో సమావేశం * కొందరు నేతలు, కార్యకర్తల తీరుపై అసహనం**

**ఇచ్ఛాపురం, నవంబర్ 15 (వార్త):** తెలుగుదేశం పార్టీ ప్రాథమిక, క్రియాశీలక సభ్యత్వాలు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మందకొడిగా సాగుతోంది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే సభ్యత్వ నమోదులో నియోజకవర్గం 174వ స్థానం ఉంది. దీంతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పార్టీ కేడర్‌పై సీరియస్ అయినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలకి వెళ్లే ముందు పార్టీ ముఖ్య నాయకులను మండలాలు, మున్సిపాలిటీల వారీగా పిలిచి సభ్యత్వ నమోదులో అలసత్వంపై క్లాస్ పీకినట్లు సమాచారం. ఏదో పని ఉందని కొంతమందికే ఫోన్లు రావడంతో అందరూ ఏదో నామినేటెడ్ పదవులు పంపకాలు ఉంటాయని ఊహించి ఆఘమేఘాలు మీద వెళితే అక్కడ సీన్ రివర్స్ అయిందని తెలిసింది. ముఖ్యంగా మున్సిపాలిటీ నాయకుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించిన నియోజకవర్గంలో మందకొడిగా సాగుతుండడంపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి ఎప్పటికప్పుడు డాష్ బోర్డులో నివేదికలు ఘోరంగా ఉండడంతో క్యాడర్ పని తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఏ చిన్న శుభకార్యం ఉన్న, మరే పరామర్శ ఉన్నా, ఒక్క ఫోన్ కాల్‌తోనే తాను హాజరవుతున్నానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను వెంటనే స్పందిస్తున్నానని, అర్ధరాత్రి ఫోన్ చేసిన ఫోన్ ఎత్తి కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నానని, అటువంటిది సభ్యత్వాలు పట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు టీడీపీ కేడర్ చెబుతోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని భుజాలు గజాలు చేసుకుని పార్టీని నిర్వీర్యపరిస్తే సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో వంద రూపాయలు చొప్పున సభ్యత్వ రుసుము వసూలు చేసేవారు కొన్ని ప్రాంతాల్లో పదవులు ఆశించే ముఖ్య నాయకులు ఆ మొత్తాన్ని కూడా చెల్లించేవారు. తర్వాత పివిసి కార్డులు వచ్చేవి. ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే మహానాడులో గుర్తింపు కార్డుల కోసం సభ్యత్వాలు చెల్లించేవారు. పార్టీ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు సభ్యత్వంలో ఉన్నాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో 200 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇది కూడా సభ్యత్వ నమోదుపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. కొంతమంది నేరుగా సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్నట్లు తెలిసింది. అయితే పివిసి కార్డ్ కావాలనే వారికి డౌన్ లోడ్ చేసి కార్డ్ ఇచ్చేందుకు 100 రూపాయలు అదనంగా వసూలు చేస్తునట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా రోజు వారీ వేగవంతం చేసేందుకు ఒక కార్యదర్శిని నియమించి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఎవరు ఎన్ని సభ్యత్వాలు చేశారో తెలిసేది. ఇప్పుడు ఆన్లైన్లో ఎవరు ఎన్ని చేసినా గుర్తింపు రాకపోవడంతో నాయకుల ఎవరు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. కరోనా వంటి సమయంలో, పార్టీ అధికారం లేని సమయంలో కూడా సభ్యత్వాల్లో జోరుగా జోష్‌గా సాగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సభ్యత్వాలు పక్క పార్టీ జనసేన స్థాయి కూడా దాటకపోవడంతో అందరూ సీరియస్‌గా తీసుకొని పనిచేసి ప్రథమ స్థానంలో నిలిపేందుకు పాటుపడాలని కోరినట్లు సమాచారం.



## స్వాభిమాన్‌కు 14 వినతులు

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 15(వార్త):** దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుండి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కవితతో కలిసి వినతులు స్వీకరించారు. స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ ప్రతీ నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డి.సి.హెచ్.యస్ డా.కళ్యాణబాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా, గృహ నిర్మాణం సంస్థ, లీడ్ బ్యాంకు, బి.సి కార్పొరేషన్ జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు, బధిరులు, బ్లైండ్ సంఘాల సభ్యులు హాజరయ్యారు.

## సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం

### ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం క్రైం, నవంబర్15(వార్త):** పోలీస్ సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇస్తు వారి వ్యక్తిగత, ఉద్యోగ రీత్యా సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, ఆరోగ్య, ఉద్యోగ రీత్యా సమస్యలు ఉంటే నిర్భయంగా చెప్పడానికి అవకాశం కల్పిస్తూ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్మ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి ఎటువంటి సమస్య ఉన్న నిత్యం మీకోసం అందుబాటులో ఉంటానని నిర్భయంగా తెలుపవచ్చునని తెలిపారు.ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమం సిబ్బంది కొరకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసరమైనప్పుడు ఫోన్ కాల్ ద్వారా కూడా సమస్యలను సిబ్బంది తెలియపరుచుకోవచ్చుని ఆయా సమస్యలకు పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా కల్పించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు క్రమశిక్షణ, బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## విద్యార్థులు సన్మార్గంలో నడుచుకోవాలి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్15(వార్త):** విద్యార్థులు చదువుకున్న వయసులో సన్మార్గంలో నడుచుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలని శ్రీకాకుళం పట్టణ డిఎస్పి సిహెచ్ వివేకానంద తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలో స్థానిక 80 అడుగుల రహదారిలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సంకల్పం పేరిట మాదక ద్రవ్యాలు వినియోగము వలన కలిగే దుష్ప్రభావాలు, అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ విద్యార్థులు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ప్రధానంగా గంజాయి డ్రగ్స్ తదితర మత్తుపదార్థాలు వినియోగానికి దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడితే కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించడానికి సంకల్పం అనే కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఇటీవల కాలంలో గంజాయి క్రయ విక్రయాలు చేసిన వారిపై, అక్రమంగా కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయడు, ఎస్ఐ హరికృష్ణ, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేపర్ ప్లేట్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

**పలాస, నవంబర్15(వార్త):** స్థానిక లేబర్ కాలనీలో టంకాల సునీల్‌కు చెందిన పేపర్ ప్లేట్ తయారీ పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. రెండు పేపర్ ప్లేట్ యంత్రాలతో పాటు ముడిసరకు కాలిపోయింది. ఈ ఘటనలో రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు భావిస్తున్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546